
# ఫ్లాష్ బ్యాక్




**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## కె.ఎస్.ఆర్.దాసు

### (1985, డిసెంబర్, విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)

ఒక శాఖలోంచి మరొక శాఖలోకి ప్రవేశించడం, నేడు సినీ పరిశ్రమలో అతి సాధారణ విషయమే అయినప్పటికీ రాణించిన వారు మాత్రం కొద్ది మందే వున్నారు. అలాంటివారిలో ప్రముఖ దర్శకుడు. కె. యస్. ఆర్. దాస్ ముఖ్యులు. 1956 లో మద్రాసులో–అడుగు పెట్టిన దాస్ ఎడిటింగ్ శాఖలో ప్రవేశించి దాదాపు ఇరవై చిత్రాలకు పైగా ఎడిటర్ గా పనిచేసి, "లోగుట్టు పెరుమాళ్ల కెరుక" చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయమై, ఇంతవరకూ దాదాపు డెబ్బై అయిదు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన దర్శకత్వం వహించిన "రౌడీ రాణి", "టక్కరి దొంగ" – చక్కని చుక్క", "మోసగాళ్ళకు మోసగాడు" మొదలైన చిత్రాల పేర్లు వినగానే దర్శకుడు కె.యస్. ఆర్. దాస్ గుర్తుకు రావడం సహజం.




అలా క్రైం చిత్రాల దర్శకుడిగా ప్రేక్షకుల హృదయాల్లో ముద్ర వేసుకున్నారు దాస్.

ఈ మధ్య వాహినీ స్టూడియోలో పింజల

ఆనందరావు సమర్పణలో తయారవుతున్న "ఖైదీ రాణి" చిత్రం షూటింగ్ సందర్భంలో "విజయచిత్ర" కె.యస్. ఆర్. దాస్ ను కలిసి కాసేపు సంభాషించింది.

"చాలావరకూ అంటే దాదాపు అన్నీ క్రైం చిత్రాలే మీ దర్శకత్వంలో రావడానికి కారణం ఏమిటి" అని అడిగిన "విజయచిత్ర" తొలి ప్రశ్నకు సమాధానంగా-

"నేను ఎడిటింగ్ శాఖలో పని చేస్తున్నప్పుడు ప్రముఖ నిర్మాత భావనారాయణ గారు తీసిన " బంగారు తిమ్మరాజు"," "తోటలో పిల్ల-కోటలో రాణి, "ఆకాశరామన్న", "గోపాలుడు-భూపాలుడు", "భూలోకంలో యమలోకం' చిత్రాలకు ఎడిటర్ గా పని చేశాను. అప్పట్లో భావనారాయణ గారు "లోగుట్టు పెరుమాళ్ల కెరుక" చిత్రం ప్రారంభిస్తూ నన్ను దర్శకుడిగా పరిచయం చేసారు. దర్శకత్వం చేసిన తొలి చిత్రమే క్రైం చిత్రం కావడం, అది విజయవంతం కావడం వల్ల ఆ తర్వాత వరసగా నాకు అలాంటి అవకాశాలే వచ్చి నేను క్రైం చిత్రాల దర్శకుడిగా "ముద్ర" పడడం జరిగింది.

అయినా నేను దర్శకత్వం వహించిన చిత్రాల్లో "బంగారు కుటుంబం", "ప్రేమజీవులు", "మావూరి గంగ", "గిరిజా కల్యాణం", "ఈనాటి బంధం ఏనాటిదో" వంటి కుటుంబ గాథా చిత్రాలు కూడా వున్నాయి, కాని అప్పటికే నేను "క్రైం చిత్రాల దర్శకుడి" గా ముద్ర పడడంతో, నా దర్శకత్వంలో అలాంటి చిత్రాలనే ఆశించిన ప్రేక్షకులకు నిరుత్సాహం కలగడం వల్ల నో, మరి దేనివల్లనో అని అంతగా ఆర్థిక విజయం సాధించ లేకపోయాయి" – అని సమధానమిచ్చారు దాస్.

"డెబ్బై అయిదు చిత్రాల దర్శకుడిగా, మీ అనుభవం దృష్ట్యా నేటి యువ దర్శకులపై మీ అభిప్రాయం ఏమిటి?" – అని అడిగినదానికి, "నేటి యువ దర్శకులు చాలా మంది "కేవలం ఫైట్స్, ఏక్షన్ మీద ఆధారపడి, వాటి మీద శ్రద్ధ చూపి చిత్రాలను చేయడం జరుగుతోంది. వారి ఆలోచనా సరళిలో "ఆధునికత" లోపిస్తోంది. పాటలకు, ఫైట్స్ కు, ఎక్కువ ప్రాధాన్యతనిస్తే, 'మినిమమ్ గ్యారంటీ' కి లోటు లేదనే నమ్మకంతో ఆ పద్ధతినే అవలంబిస్తున్నారు. కాని క్వాలిటీలో "డెవలప్ మెంట్ ' కనిపించడం లేదు. వీటివల్ల మంచి నటులు గాని, టెక్నీషియన్స్ గాని పరిచయం కాలేకపోవడం జరుగుతోంది. అలా గాకుండా "శంకరాభరణం" లాంటి చిత్రాలను నిర్మిస్తే వాటి ద్వారా మంచి నటులు , టెక్నీషియన్స్ కూడా పరిచయం కావడానికి, అభివృద్ధిలోకి రావడానికి ఆస్కారం ఎంతైనా వుంది. అయితే, ఇక్కడ అన్నిటికన్నా ముఖ్యంగా చెప్పవలసింది ఒకటి వుంది. అది "అదృష్టం" —— అని ఒక్క క్షణం ఆగారు.

"అంటే కృషికంటే అదృష్టం మీదే మీకు ఎక్కువ నమ్మకమా?" అడిగింది విజయచిత్ర.

దానికి ఆయన చిన్నగా నవ్వి "కష్టాలూ, సుఖాలూ నాకు తెలుసు. అంచేత నా దృష్టిలో కృషికంటే అదృష్టమే ప్రధానం. ఎందుకంటే నేటి పరిస్థితుల్ని ఉదాహరణగా తీసుకుంటే . 'డైరెక్షన్' అంటే ఏమిటో తెలియనివాళ్ళు డైరెక్టర్స్ అవుతున్నారు. "ప్రొడక్షన్" గురించి తెలియనివాళ్ళు "ప్రొడ్యూసర్స్" అవుతున్నారు. నటన' అంటే ఏమిటో తెలియని

వాళ్ళు 'నటులు' అవుతున్నారు. "హీరో"లవుతున్నారు. దీనికి కారణం అదృష్టమే కదా?' – అని తిరిగి ప్రశ్నించారు సమాధానంగా.

"మీరు చెప్పిన దాంట్లో కూడా నిజం లేకపోలేదు" అని." మీరు సినీ రంగంలో ప్రవేశించినప్పటికీ ఇప్పటి వచ్చిన మార్పులపై మీ ఉద్దేశ్యం ఏమిటి–అని మరో ప్రశ్న వేసింది, విజయచిత్ర.

"అప్పటికీ ఇప్పటికీ మార్పు – అంటే, చాలాఉంది. అప్పట్లో "ఆర్టిస్టు"లు నిర్మాతల చుట్టూ తిరిగేవారు, ఇప్పుడు నిర్మాతలు ఆర్టిస్టులు చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పుడు వచ్చే యువకుల తండ్రులు నా దగ్గర పనిచేసారు అప్పటికన్నా ఇప్పుడు "డిస్ట్రబెన్సెస్" జాస్తి అయ్యాయి. మునుపటి రోజుల్లో సినీ పరిశ్రమలో రాజకీయాలు ఉండేవికావు. ఈనాడు సినీ పరిశ్రమలో రాజకీయాలు చోటు చేసుకున్నాయి. ఎవరిమట్టుకు వారు ఒక గ్రూప్ గా ఏర్పడడం, ఎవరికికావలసిన వారిని ఎన్నుకోవడం జరుగుతోంది. ఈ కారణాల దృష్ట్యా క్రొత్తవాళ్ళకి అవకాశాలు లేవు. ఇంతకూముందు అయితే నటీమణులుగానీండి, ఇతర టెక్నీషియన్స్ గానీండి, ఎవరైనా ఒక స్థాయికి చేరుకున్న తరువాత చిన్నవాళ్ళని, టాలెంట్ ఉన్నవాళ్ళని బాగా ఎంపిక చేసేవారు. అది ఈనాడు లేదు.

ఉదాహరణకు, నా దగ్గరకు వచ్చి, నా నుండి "వర్క్" నేర్చుకున్నవాళ్ళు, బాగా "షైన్" అయినవాళ్లు చాలామంది ఉన్నారు. క్రైమ్ చిత్రాలను ఏ విధంగా 'హేండిల్' చేయాలి? ఎలాంటి 'టెక్నీక్' ఉపయోగించాలి? ఏ విధంగా తీస్తే మన చిత్రం విజయవంతం అవుతుంది? – అనే అంశాలు నా దగ్గర ఎందరో నేర్చుకున్నారు. పైకి వచ్చారు. ఈనాటి యువతరానికి ఆ అవకాశం అంతగలేదు"– అని సమాధానమిచ్చారు.

"ఫిల్మ్ ఎడిటర్" గా తగినంత అనుభవం గడించిన మీకు ఆ అనుభవం దర్శకుడిగా ఏ విధంగా ఉపయోగపడుతోంది? దర్శకుడికి "ఎడిటింగ్" గురించి అవగాహన ఎంతవరకు అవసరం?" – అని ప్రశ్నించినదానికి

"ఎడిటింగ్ లో నాకున్న అనుభవం దర్శకుడిగా అన్ని విధాల నాకు చాలా ఉపయోగపడింది. ముఖ్యంగా సన్నివేశ చిత్రీకరణ లో అప్పటికప్పుడు వాటిలో 'డెసిషన్' తీసుకోవడం వలన చాలా వరకు పొదుపు చేయడానికి ఆస్కారం ఉంది. నేను దర్శకత్వం వహిస్తున్న ఎప్పుడు ఎడిటర్ గా నా అనుభవాన్ని ఉపయోగించి సాధ్యమైనంతవరకు ఫిలింని 'వేస్ట్' చేయకుండా పొదుపు చేసి చిత్రాన్ని 'స్పీడ్' గా చిత్రీకరించగలుగుతున్నాను. ఏ షాట్ అవసరమో, ఏది అనవసరమో ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి అవసరమైనంత వరకే 'షాట్' ని చిత్రీకరించడం, తద్వారా నా చిత్రాల్లో 'స్తబ్దత' లేకుండా 'స్పీడ్' గా కథను నడిపించడానికి కారణం 'ఎడిటింగ్' లో నాకున్న అనుభవమే. ఇక, ప్రతీ దర్శకుడికీ 'ఎడిటింగ్' లో పరిజ్ఞానం అవసరమా అంటే "అవసరమని చెప్పక తప్పదు" అని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

"నేటి సినీపరిశ్రమ పరిస్థితిపై మీ అభిప్రాయం ఏమిటి?" – అని అడిగినదానికి "ప్రొడక్షన్ కాస్ట్" పెరిగింది. ముఖ్యంగా 'ఆర్టిస్ట్' ల పారితోషకాలే "ప్రొడక్షన్ కాస్ట్" ని పెంచాయి. దీనివలన చిత్రాలను "రిచ్" గా నిర్మించడం

అసాధ్యమవుతోంది. ఇలా చిత్ర నిర్మాణ వ్యయం పెరగడానికి, హీరోల పారితోషకాలు పెరగడానికి కారణం ఏరియాలవారీ కొనుగోలుదార్లు. "తారా" బలాన్ని బట్టి కొనుగోలుదారుల లోనే పోటీ ఏర్పడి, ఎక్కువ మొత్తాలలో 'ఆఫర్' చేయడం, 'హీరో' లకు డిమాండ్ రావడం, తద్వారా 'బడ్జెట్' పెరగడమే తప్ప చిత్రనిర్మాణంలో 'క్వాలిటీ' మాత్రం పెరగడం లేదు. చిత్రాలు ఎక్కువ రోజులు నిలబడడానికి ఆస్కారం కూడా ఉండడం లేదు. అంచేత, ఈ కారణాల దృష్ట్యా, చిత్రపరిశ్రమ బాగుపడాలంటే కొనుగోలుదారీ విధానం మారాలి. "డిస్ట్రిబ్యూషన్" విధానం అమలులోకి రావాలి" – అని తన అభిప్రాయాన్ని స్పష్టం చేశారు.

"మీరు తెలుగులోనే గాక హిందీ కన్నడ చిత్రాలకు కూడా దర్శకత్వం వహించారు కదా, ఆ అనుభవం దృష్ట్యా ఏదైనా వ్యత్యాసాన్ని మీరు గమనించారా?" అన్న దానికి "హిందీలో "రాణి మేరా నామ్", "రాణి అవుర్ జానీ", "ఇఫాజత్" చిత్రాలకు పనిచేశాను. కన్నడంలో నేను దాదాపు పదిహేను చిత్రాలు చేశాను. ముఖ్యంగా చెప్పాలంటే కన్నడ పరిశ్రమలో 'ఆర్టిస్ట్' లు మన 'ఆర్టిస్ట్' ల లాగా బాగా 'డిమాండ్' చేయరు. అక్కడ ఆర్టిస్ట్ లు, టెక్నీషియన్స్ కంట్రోల్ లో ఉంటారు. వారు దర్శకుడునీ, నిర్మాతనీ ఎంతో గౌరవిస్తారు. కళపట్ల వారికి ఎక్కువ ఆసక్తి ఉంది. "స్టార్ డం" మీద వాళ్లకు పెద్ద మోజు లేదు", అని సమాధానమిచ్చారు.

"ఏక్షన్ చిత్రాల యుగంలో క్రైమ్ చిత్రాల దర్శకుడిగా ముద్ర పడిన మీరు కూడా 'ఏక్షన్ ఓరియెంటెడ్' చిత్రాలు కాకుండా, ఒక చక్కని 'ఫ్యామిలీ సెంటిమెంట్' చిత్రం చేస్తే మీకు అది వెరైటీగా ఉంటుంది కదా?" అని ప్రశ్నించిన దానికి, "నేను ఇప్పటికే చాలా అలసిపోయాను. అప్పటి కె.ఎస్. ఆర్. దాస్ వేరు, ఇప్పటి కె.ఎస్. ఆర్. దాస్ వేరు. ఇంతకుముందు నేను కుటుంబ కథా చిత్రాలు చేయాలని ప్రయత్నించాను. కాని విజయం పొందలేక పోయాను. మళ్ళీ ఆ ప్రయత్నం చేసి అపజయం పొందడం, నిర్మాతలకి కష్టం నష్టం కలిగించడం నాకు ఇష్టం లేదు" – అని తన అభిప్రాయాన్ని స్పష్టీకరించారు.

"మీరు సంవత్సరానికి ఎన్ని చిత్రాలు చేయడానికి నిశ్చయించుకున్నారు? ప్రస్తుతం మీరు చేస్తున్న చిత్రాలు ఏమిటి? "నేరస్థుడు" తర్వాత మీరు సొంతంగా ఏదైనా చిత్రం నిర్మించడానికి ప్లాన్ చేస్తున్నారా?" అని అడిగిన ప్రశ్నలకు బదులుగా –

" నేను ఎప్పుడూ పెద్దగా 'హిట్ పిక్చర్స్' చేయలేదు. 'హిట్ పిక్చర్స్' ఉన్న రోజుల్లోనూ గాప్ లేకుండా నేను చిత్రాలకు దర్శకత్వం వహించాను. ఇప్పుడూ చేస్తున్నాను. సంవత్సరానికి ఇన్ని చేయాలని నేను ఎన్నడూ అనుకోలేదు. నన్ను కావాలనుకుని నా దగ్గరికి వచ్చిన వాళ్ళకి, మనకు కావలసిన వారికి, 'లిమిటెడ్' గా చేయడానికి నేను నిర్ణయించుకున్నాను. ప్రస్తుతం తెలుగులో 'కుట్ర', 'ఖైదీ రాణీ' చేస్తున్నాను. ప్రతీ ఏడూ సాధారణంగా రెండు కన్నడ చిత్రాలు చేస్తూనే ఉన్నాను. జనవరి నుంచి కన్నడంలో రెండు చిత్రాలు చేస్తున్నాను. తర్వాత, అర్జున్ హీరోగా మార్చి లో

గాని, ఏప్రిల్లో గాని మా సొంత చిత్రం ప్రారంభమవుతుంది. కథ ఇంకా 'ఫైనలైజ్' కాలేదు. ఇదిగాక భవిష్యత్తులో మంచి 'ఫోక్ లోర్' చిత్రం తీయాలని ఉంది అది ఖర్చు ఎక్కువ అవుతుందని ఆలోచిస్తున్నాను" అన్నారు కె.ఎస్.ఆర్.దాస్ ముగింపుగా.

★★★